# సాక్షి గుంటూరు

మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025




## జిల్లా ఎస్పీ అభినందనలు


నగరంపాలెం: కానిస్టేబుళ్ల ఉద్యోగాలకు ఎంపికైన హోంగార్డులు సోమవారం ఎస్పీ సతీష్ కుమార్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని ఎస్పీ అభినందించారు.



## పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,55,878 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. దిగువకు 2,76,599 క్యూసెక్కులు వదులుతున్నారు.

## మొక్కజొన్నలతో పూజలు



నరసరావుపేటఈస్ట్: నరసరావుపేట టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ సమీపంలో హెల్పింగ్ హ్యాండ్స్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలోని గణపతికి సోమవారం 1108 మొక్కజొన్న కండెలతో సహస్ర అష్టోత్తర పూజ నిర్వహించారు.

## న్యూస్‌రీల్

### 13న జాతీయ లోక్‌అదాలత్





గుంటూరు లీగల్: ఈనెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేయడానికి ప్రయత్నం చేయాలని నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.శరత్‌బాబు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో సివిల్ జడ్జిలకు, పోలీస్ అధికారులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ సోమవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి వి.ఏ.ఎల్. సత్యవతి, మూడో అదనపు జిల్లా జడ్జి సీహెచ్.వెంకట నాగ శ్రీనివాసరావు, రెండో అదనపు జిల్లా జడ్జి వై.నాగరాజా, ఐదో జిల్లా జడ్జి స్పెషల్ కోర్ట్ ఫర్ ది ట్రయిల్ ఆఫ్ ఆఫెన్సెస్ అగైనెస్ట్ విమెన్ కె.నీలిమ పాల్గొన్నారు. ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి తగు సలహాలు, సూచనలు చేశారు.

### ఆధునిక వసతుల అంబులెన్స్ ప్రారంభం



గుంటూరు వెస్ట్: వెంటిలేటర్‌తోపాటు అత్యాధునిక సదుపాయాలతో కూడిన అంబులెన్స్ ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో అంబులెన్స్‌కు జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రజల అత్యవసర చికిత్స కోసం అందించనున్న 190 వాహనాలలో తొలి వాహనం అందిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 24 అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నాయని వీటిలో 15 బేసిక్ లైఫ్ సపోర్ట్ ఇచ్చేవి కాగా 9 అడ్వాన్స్ సదుపాయాలు కలిగినవన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వి, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీవీ రంగారావు, ఎన్టీఆర్ జిల్లా వైద్య సేవా కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ విజయ్ ప్రకాష్, 108 జిల్లా మేనేజర్ పి.బాలకృష్ణ పాల్గొన్నారు.

### ఓవర్ బ్రిడ్జిపై ఇరుక్కుపోయిన వాహనం



తెనాలిరూరల్: తెనాలి ఓవర్ బ్రిడ్జి వద్ద సోమవారం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గణేష్ నిమజ్జనం కోసం ఉపయోగించిన డీజే సౌండ్ సిస్టంలను తీసుకెళుతున్న ఓ వాహనం బ్రిడ్జి మొదట్లో నిలిచిపోయింది. ఫుట్‌పాత్, డివైడర్‌కు మధ్యలో వాహనం నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. అతి కష్టం మీద వాహనాన్ని తొలగించాల్సి వచ్చింది. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ట్రాఫిక్ అంతరాయంతో సుమారు గంట పాటు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వంతెనపై వాహన రాకపోకలను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన కాంక్రీట్ దిమ్మెలను పక్కకు జరిపి ఇరుక్కుపోయిన వాహనాన్ని తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

### పశ్చిమ డెల్టాకు 7,026 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజ్ నుంచి 7,026 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బ్యారేజి వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కి 276, క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్ 1,760, క్యూసెక్కులు, తూర్పు కాలువకు 479, పశ్చిమ కాలువకు 240, నిజాంపట్నం కాలువకు 465, కొమ్మూరు కాలువకు 2,680 క్యూసెక్కులు, బ్యారేజి నుంచి సముద్రంలోకి 3,28,125 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

వైఎస్ఆర్.. ఆ పేరే ఒక ప్రభంజనం

- ఎవరూ చెరపలేని, మరువలేని సజీవ సంక్షేమ సంతకం
- పేదింటి గుండె కోవెలలో నేటికీ ఆయన సజీవం
- అన్నదాతల చిక్కటి చిరునవ్వుల్లో ఆయన చిరునామా పదిలం
- డాక్టర్లుగా, ఇంజినీర్లుగా మారిన పేదింటి బిడ్డల హృదయాల్లో ఆయన స్థానం చిరస్మరణీయం
- ఆయనంటే నమ్మకం.. ఆయనుంటే జన సందోహం
- ఉమ్మడి జిల్లాపై మహానేత మమకారం అపూర్వం
- జిల్లా అభివృద్ధిపై ఆయన ముద్ర శాశ్వతం







# జిల్లా అభివృద్ధిపై రాజముద్ర

## రాజన్నా.. నిను మరువలేమన్నా

- ఉమ్మడి గుంటూరు జిల్లా అభివృద్ధిపై వైఎస్సార్ చెరగని ముద్ర
- పులిచింతల నిర్మాణంతో తీరిన అన్నదాతల చింతలు
- రూ.వేల కోట్లతో సాగర్ కాల్వల ఆధునికీకరణ
- మహానేత చివరి సంతకమూ ఇక్కడి రైతుల కోసమే..
- గుంటూరు నగర ప్రజల దాహార్తిని తీర్చిన రాజన్న
- నేడు వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం





2004 అక్టోబర్ 15న పులిచింతల ప్రాజెక్టు పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న మహానేత వైఎస్సార్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రైతును రాజును చేయాలని అహర్నిశలు కలలుగన్న రైతుబాంధవుడు దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి. రైతు సంక్షేమమే ధ్యేయంగా ఆ మహానేత ముందుకు వెళ్లారు. జలయజ్ఞంలో భాగంగా పులిచింతల ప్రాజెక్టు రూపకల్పనతో పాటు ఆయకట్టు స్థిరీకరణ కోసం పాటు పడ్డారు. రైతుల బతుకు చిత్రాన్ని మార్చడం కోసం కలలు కన్నారు. గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజల చిరకాల స్వప్నమైన పులిచింతల ప్రాజెక్టును ఆయన అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే 2004 అక్టోబరు 15వ తేదీన రూ. 680 కోట్లతో శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు విజయవాడ, గుంటూరు నగర ప్రజల దాహార్తి తీర్చడంతోపాటు కృష్ణా డెల్టాలో 13 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించడానికి ఉపయోగపడుతోంది. ఈ మధ్యకాలంలో వర్షాభావ పరిస్థితులు వచ్చినా సరే కృష్ణా డెల్టాకు నీటి ఇబ్బంది లేకపోవడానికి పులిచింతల ప్రాజెక్టే కారణం అనడంలో అతిశయోక్తి లేదు.

### జలయజ్ఞంతో సస్య శ్యామలం

నాగార్జున సాగర్ కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ కోసం 2008 ఫిబ్రవరి 2న రూ.4,444.41 కోట్లతో నాగార్జున సాగర్ కుడి, ఎడమల కాలువల ఆధునికీకరణకు అనుమతి ఇచ్చారు. దీని ద్వారా నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలో 6.74 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది. కృష్ణా పశ్చిమ డెల్టాలో కాలువల ఆధునికీకరణ కోసం రూ. 4,573 కోట్లు కేటాయించారు. ఇందులో గుంటూరు జిల్లాకు సంబంధించి రూ.1760.15 కోట్లను కేటాయించారు. ఇందులో రూ.1187 కోట్ల పనులు జరిగాయి. దీని ద్వారా జిల్లాలో 5.22 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది. మహానేత పదవీకాలంలో ఉమ్మడి జిల్లా వాసులకు ఉపయోగపడే ఎన్నో ప్రాజెక్టులను ఆయన పూర్తి చేసి జిల్లా అభివృద్ధిపై చెరగని ముద్రను వేసుకున్నారు.

### ఉమ్మడి జిల్లాపై చెరగని ముద్ర

- రాష్ట్ర వ్యాప్తంగా రూ. 12వేల కోట్ల రుణమాఫీలో జిల్లా రైతులు దాదాపు 6.07 లక్షల మందికి రూ. 560 కోట్ల మేర లబ్ధి చేకూరింది.
- ఇందిర ప్రభ పథకం జిల్లాలో ప్రారంభించి ఉమ్మడి జిల్లా రైతులకు పెద్ద పీట వేశారు.
- ఇందిరమ్మ ఫేజ్–2 ఇళ్లను జిల్లాలోనే ప్రారంభించారు.
- రాజీవ్ పల్లెబాట ద్వారా ఎన్నో గ్రామాలకు తాగునీరందించి పల్లె వాసుల మనస్సుల్లో చెరగని ముద్ర వేశారు.
- గుంటూరు నగర ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ. 6.50 కోట్లతో తక్కెళ్లపాడు రా వాటర్ ప్లాంట్ నుంచి తక్కెళ్లపాడు నీటి శుద్ధి వాటర్ పాంట్ల వరకు రెండో పైపు లైను నిర్మించారు. తమ నీటి కష్టాలు తీర్చిన మహానేతను నగర ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటూనే ఉన్నారు.
- 2008, జూన్ 5న ప్రాజెక్టు వద్ద రైతు సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన వైఎస్సార్ పెదకూరపాడు నియోజకవర్గంలోని పెదకూరపాడు, అచ్చంపేట, అమరావతి, క్రోసూరు మండలాల్లో సాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు కృష్ణానది నుంచి సాగునీటిని అందించేందుకు ఒకే సారి 10 ఎత్తిపోతల పథకాల నిర్మాణాలకు రూ.250కోట్ల నిధులు మంజూరు చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఇప్పుడు ఆ పథకాలు మొత్తం పూర్తి కావడం వల్లనే నియోజకవర్గంలో పంట పొలాలు సాగునీటితో కళకళలాడుతున్నాయి.
- రూ.460 కోట్లతో ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టిన తాగునీటి పథకానికి ఆయనే అంకురార్పణ చేశారు.
- విద్యుత్ బకాయిలు మాఫీ చేయడం ద్వారా జిల్లాలో 80 వేల మంది రైతులకు లబ్ధి చేకూరింది. విద్యుత్ బకాయిల మాఫీ ద్వారా జిల్లాలోని రైతులకు రూ. 36 కోట్ల లబ్ధి కలిగింది.
- అమరావతి మండలం నరుకుళ్లపాడులో లెవెల్ బ్రిడ్జిలో పడి ఎనిమిది మంది మృతి చెందడంపై డాక్టర్ వైఎస్సార్ తీవ్ర మనస్తాపానికి గురై ప్రమాదకరంగా ఉన్న నరుకుళ్లపాడు, ఎండ్రాయి బ్రిడ్జిలను హైలెవెల్ చేసేందుకు నిధులు మంజూరు చేశారు. ఆ రెండు బ్రిడ్జిల నిర్మాణాలు పూర్తి కావడంతో ఇప్పుడు ఎంత వర్షం పడినా ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేవు.
- ఉచిత విద్యుత్ పథకం ద్వారా జిల్లాలోని 80 వేల మంది రైతులకు ఏడాదికి రూ. 281.60 కోట్ల లబ్ధి చేకూరింది. దీంతోపాటు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నిరుపేదల పాలిట అపర సంజీవనిగా పేరొందిన ఆరోగ్యశ్రీ పథకాన్ని 2008లో గుంటూరు నుంచి ఆయన ప్రారంభించి జిల్లా ప్రజలు మరిచిపోలేని విషయం.

### చివరి సంతకం ఇక్కడి రైతుల కోసమే..

వైఎస్సార్ చివరి సంతకం చేసిన ఫైల్ కూడా జిల్లాలో మిర్చి రైతులకు వాతావరణ ఆధారిత బీమా కింద ప్రయోజనం చేకూర్చేదే. ఈ బీమాతో జిల్లాలో నాలుగు లక్షల మందికి పైగా రైతులు లబ్ధి పొందారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మిర్చి రైతులు ఎకరానికి రూ.లక్ష వరకూ నష్టపోయారు. వారిని ఆదుకుంటామని ప్రకటన చేసినా ఇంతవరకూ పైసా కూడా విదల్చలేదు. దీంతో జిల్లా రైతులు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను గుర్తు చేసుకుంటున్నారు.

ముఖ్యమంత్రి హోదాలో మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి జిల్లాలో 57 సార్లు పర్యటించారంటే ఆయనకు జిల్లాపై ఉన్న మమకారం అర్థం అవుతుంది.



నరసరావుపేటలో జ్యోతి వెలిగించి రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభిస్తున్న దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి(ఫైల్)



ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించి చిన్నారిని పరీక్షిస్తున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ (ఫైల్)



నరసరావుపేట పట్టణాభివృద్ధి పైలాన్‌ను ఆవిష్కరించి అభివాదం చేస్తున్న మహానేత (ఫైల్)

# అర్జీల పరిష్కారంలో అలసత్వం తగదు

## జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: అర్జీల పరిష్కారంలో సిబ్బంది అలసత్వం ప్రదర్శించకూడదని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఒకసారి పరిష్కరించే అర్జీలు తిరిగి ఓపెన్ కాకుండా చూసుకోవాలన్నారు. బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లే అర్జీలు రీఓపెన్ అయితే సంబంధిత అధికారులపై క్రమశిక్షణా చర్యలుంటాయన్నారు. అర్జీల పరిష్కారంలో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జి.సాయి శ్రీకాంత్, పి.దీపు మార్టిన్‌లకు కలెక్టర్ కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేసారు. అనంతరం వచ్చిన 220 అర్జీలను కలెక్టర్‌తోపాటు జేసీ ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ, జిల్లా అధికారులు

### వరి రైతుల కష్టాలను పట్టించుకోండి



జిల్లాలో వరి పండించే రైతుల సమస్యలను ప్రభుత్వం గాలికొదిలేసింది. ఎన్ని సార్లు అర్జీలు పెట్టుకున్నా, స్థానిక ప్రజాప్రతినిధిని కలిసినా పట్టించుకోవడంలేదు. గుంటూరు రూరల్ జొన్నలగడ్డ గ్రామంలో సుమారు 500 ఎకరాల్లో వరి ఎండిపోయింది. తూటికాడ, జమ్ము, రెల్లుతో పంట కాలువలు నిండిపోయాయి. స్పందించి రైతులను ఆదుకోండి.

– కె.అజయ్ కుమార్,
ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

### దివ్యాంగుల సమస్యలపై స్పందించండి



ఎన్నో ఏళ్లుగా దివ్యాంగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి పోరాడుతున్నాం. ఎస్‌హెచ్‌డీసీ రుణాలకు సంబంధించి సబ్సిడీని అందించాలి. అర్హతను బట్టి మాకు రావాల్సిన వాహనాలు అందించాలి. ప్రత్యేక కాలనీల ఏర్పాటుతోపాటు పెట్రోల్ అలవెన్సులు అందించాలి. నెలకొకసారైనా ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలి.

– దివ్యాంగులు, గుంటూరు

# అంతర్ జిల్లాల దొంగలు అరెస్టు

- అత్తోటకు చెందిన వృద్ధురాలిపై దాడి కేసు ఐదు రోజుల్లో ఛేదన
- సుమారు రూ.13 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, నగదును పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: ఐదు రోజుల క్రితం ఒంటరి వృద్ధురాలిపై దాడికి పాల్పడిన ఇద్దరు అంతర్ జిల్లా దోపిడీ దొంగలను కొల్లిపర పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. వారి నుంచి రూ.13 లక్షల ఖరీదైన బంగారం స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ వివరాలు వెల్లడించారు. కొల్లిపర మండలం అత్తోట గ్రామానికి చెందిన 78 ఏళ్ల వృద్ధురాలైన బొల్లిముంత బుల్లెమ్మ ఒంటరిగా నివాసం ఉంటుంది. గతనెల 26న మధ్యాహ్నం నిద్రపోతున్న ఆమెపై గుర్తు తెలియని వ్యక్తులు ఇనుప రాడ్‌తో దాడికి పాల్పడ్డారు. ఒంటిపై ఉన్న సుమారు రూ.13 లక్షల బంగారపు ఆభరణాలతో ఉడాయించారు. దీనిపై బాధితురాలి కుమారుడు కొల్లిపర పీఎస్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ కోటేశ్వరరావు కేసు నమోదు చేశారు. తెనాలి రూరల్ పీఎస్ సీఐ ఉమేష్ దర్యాప్తులో భాగంగా పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. ఓ బైక్‌పై ఉన్న ఇద్దరు నిందితులను గుర్తించారు. ప్రస్తుతం గుంటూరు బొంగరాలబీడులో ఉంటున్న పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణం లెనిన్‌నగర్ ఏడో వీధికి చెందిన కుంచపు దుర్గాప్రసాద్, ప్రస్తుతం గుంటూరు నల్లపాడులో ఉంటున్న పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణం లెనిన్‌నగర్ వాసి కొత్తపల్లి ఎలీషాలుగా గుర్తించి అరెస్ట్ చేశారు. ఈ ఇద్దరితోపాటు బంగారం భద్రపరచడం, సగభాగం విక్రయించడంలో కీలక పాత్ర పోషించిన కుంచెపు దుర్గాప్రసాద్ భార్య మున్నంగి ప్రియాంకను అరెస్ట్ చేశారు.

### రెక్కీ.. అనంతరం దాడి

నిందితులు ఇద్దరూ చిన్ననాటి స్నేహితులు.. రాత్రిళ్లు గేదెలు, గొర్రెలు, పొట్టేలు, నిలుపుదల చేసిన బైక్‌లు, ఇళ్ల తాళాలు పగులకొట్టి విలువైన వస్తువులు చోరీ చేయడంలో నేర్పరులు. ఇక వాటిని విక్రయించగా వచ్చిన డబ్బులతో చెడు వ్యసనాలకు వెచ్చించేవారు. ఈ క్రమంలో అత్తోట గ్రామంలో చోరీ చేసేందుకు వచ్చారు. ఒంటరిగా నిద్రకు ఉపక్రమించిన బొల్లిముంత బుల్లెమ్మను చూసి, కాసేపు రెక్కీ నిర్వహించి, అనంతరం ఇంట్లోకి ప్రవేశించి ఇనుప రాడ్‌తో తలపై మోది ఆభరణాలతో ఉడాయించారు. వీరిద్దరిపై 21కి పైగా కేసులున్నాయి. గుంటూరు జిల్లాలోని అరండల్‌పేట, కొత్తపేట, నగరంపాలెం, పల్నాడు జిల్లా పిడుగురాళ్ళ, మాచర్ల, వెల్దుర్తి, మాచవరం, కారంపూడి, బెల్లంకొండ, అమరావతి, రాజుపాలెం, రెంటచింతల, భీమడోలు, తణుకు పోలీసు స్టేషన్లలో పలు కేసులున్నాయి.

- రోజుల వ్యవధిలో కేసును ఛేదించిన తెనాలి సబ్ డివిజనల్ డీఎస్పీ బి.జనార్ధన్‌రావు, తెనాలి రూరల్ పీఎస్ సీఐ ఆర్.ఉమేష్, కొల్లిపర పీఎస్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు, తెనాలి రూరల్ పీఎస్ ఎస్ఐ ఆనంద్, ఏఎస్ఐ పోతురాజు, హెచ్‌సీ రామకోటేశ్వరావు, కానిస్టేబుల్ రామకృష్ణ, మహిళా కానిస్టేబుల్ హమీమ్‌లను జిల్లా ఎస్పీ అభినందించి, ప్రశంసా పత్రాలు అందించారు.

వాణిజ్యం

## నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,400 గరిష్ఠం : రూ. 3,200

మోడల్ ధర రూ. 2,800

## మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)

| | |
|---|---|
| వచ్చిన బస్తాలు | 40,877 |
| అమ్మకాలు | 38,663 |
| నిల్వ | 7,718 |

**నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)**

| | |
|---|---|
| 334 | 10,000-14,200 |
| నంబరు-5 | 10,000-13,400 |
| 341 | 10,000-15,300 |

**ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)**

| | |
|---|---|
| 334 | 10,500-14,200 |
| నంబరు-5 | 10,000-13,500 |
| 341 | 11,000-15,500 |
| 4884 | 10,000-13,500 |

**నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)**

| | |
|---|---|
| షార్క్-1 | 10,000 - 15,400 |
| సంగీ బాడిగ 5531 | 10,000 - 14,600 |
| ఆర్మూర్ | 9,800 - 12,200 |
| తాలుకాయలు | 6,200 - 7,800 |

**ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)**

| | |
|---|---|
| షార్క్-1 | 10,000 - 15,300 |
| సంగీ బాడిగ 355 | 10,000 - 14,500 |
| దువనూర్ డీలక్స | 10,500 - 13,500 |
| తాలు | 5,400 - 7,300 |

-కొరిటిపాడు (గుంటూరు)

## క్లుప్తంగా

### ఉద్యోగాల ఎంపిక జాబితా విడుదల

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ల్యాబ్ టెక్నీషియన్, మెడికల్ ఆఫీసర్, ఎఫ్ఎన్ఓ, సోషల్‌వర్కర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారికి తొలి విడత ఉద్యోగాల ఇచ్చామని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. మిగిలిన పోస్టులకు ఆర్వోఆర్ ప్రకారం రెండో జాబితాను ఎంపిక చేశామని, ఉద్యోగాలకు ఎంపిక చేసిన వారి జాబితాను గుంటూరు. ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఎంపిక జాబితాలోని అభ్యర్థులు మాత్రమే ఈనెల 3వ తేదీ ఉదయం 10 గంటలకు గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

# కుమారుడి మృతిపై అనుమానాలు

- కుమారుడి ఆకస్మిక మృతిపై ఏఎస్పీకి తల్లి ఫిర్యాదు
- పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరించిన ఏఎస్పీ, ఇతర పోలీసు అధికారులు

నగరంపాలెం: నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదులు – పరిష్కార వేదికలో బాధితుల నుంచి జిల్లా ఏఎస్పీలు జీవీ రమణమూర్తి (పరిపాలన), ఏటీవీ రవికుమార్ (ఎల్/ఓ), ఎ.హనుమంతు (ఏఆర్) ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదిదారుల మొరను ఆలకించారు. ఫిర్యాదులకు సంబంధించి పోలీస్ అధికారులతో మొబైల్ ఫోన్లల్లో మాట్లాడారు. తూర్పు సబ్ డివిజనల్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ కూడా అర్జీలు స్వీకరించారు.


కుమారుడి మృతిపై జిల్లా ఏఎస్పీ రమణమూర్తికి ఫిర్యాదు చేస్తున్న తల్లి సుజాన, పెద్దమ్మ సువార్తమ్మ

### ఎలా చనిపోయాడో తెలీదు..

మా రెండో కుమారుడు బాలస్వామి (25) గ్యాస్ డెలివరీ బాయ్‌గా పనిచేసేవాడు. ఈ ఏడాది జూలై 15 రాత్రి ఇద్దరు స్నేహితులు ఇంటికొచ్చి, పని ఉందని బయటకు తీసుకెళ్లారు. తెల్లవారుజామున 3 గంటలకు ఫోన్ చేసి, బాలస్వామి టిడ్కోగృహాల వద్ద మృతిచెంది ఉన్నాడని తెలిపారు. బాలస్వామి మృతదేహానికి శవ పరీక్షలు చేసి అప్పగించారు. అయితే మా కుమారుడి మృతిపై ఇద్దరు వ్యక్తుల మీద అనుమానాలు వ్యక్తం చేశాం. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాల్లేవు. ప్రస్తుతం అనుమానితులు బయట తిరుగుతున్నారు. కేసు రాజీకి రావాలంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. నా కొడుకు ఎలా, ఎందుకు చనిపోయాడనేది ఇప్పటికీ అంతుపట్టడంలేదు. న్యాయం చేయగలరు. – తల్లి సుజాన, పెద్దమ్మ సువార్తమ్మ, సుల్తాన్‌బాద్, తెనాలి

### రూ.10 లక్షలతో ఉడాయింపు

వ్యవసాయ పనులతోపాటు కారు డ్రైవర్‌గా చేస్తుంటాను. ఈ క్రమంలో కృష్ణాజిల్లా వాసి పరిచ మయ్యారు. సకలతంత్ర విద్యలు వచ్చని నమ్మబలికాడు. దీంతో సుమారు ఇరవై రోజులు ఇంటికి వచ్చి, వెళ్లేవాడు. డబ్బులుంటే ఇవ్వాలని పది రెట్లు ఎక్కువ చేసి ఇస్తానని బదులిచ్చాడు. అయితే అతన్ని మొదట్లో నమ్మలేదు. రెండు, మూడుసార్లు ఒంటిపై వస్త్రంలేకుండా, ఒట్టి పేపర్‌లో లిక్విడ్ పోసి గాల్లో విసిరాడు. గాల్లో విసిరిన ప్రతిసారి రూ.50 వేలు రూ.500 కరెన్సీ కాగితాలు కిందపడ్డాయి. కింద పడిన కరెన్సీ కాగితాలు పరిశీలించగా, నిజమేనని గుర్తించాను. ఈ క్రమంలో మా బంధువుల బ్యాంక్ ఖాతా నుంచి ఈ ఏడాది మే మూడో తేదిన రూ.10 లక్షలు అతనికి జమ చేయించాను. 21 రోజుల్లో రెట్టింపు చేసి ఇస్తానని నమ్మించాడు. అప్పటి నుంచి అదిగి ఇదిగో అంటూ కాలయాపన చేశాడు. ప్రస్తుతం మొబైల్ ఫోన్ పని చేయడంలేదు. న్యాయం చేయగలరు. – బాధితుడు, తుళ్ళూరు

### మహిళా కానిస్టేబుల్‌పై భర్త ఫిర్యాదు

2018లో ప్రేమించి పెళ్లి చేసుకున్నాం. నా భార్యకు మహిళా కానిస్టేబుల్‌గా ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం గుంటూరు నగరంలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తోంది. కొద్ది రోజులుగా తలెత్తిన వివాదాల కారణంగా దూరంగా ఉంటున్నాం. అయితే ప్రతిసారి 100కు డయల్ చేయడం, ఆ తరువాత పోలీసులతో దాడి చేయించడం చేస్తోంది. ఇప్పటివరకు ఏడుసార్లు కొట్టించింది. న్యాయం చేయగలరు.
– ఎస్.శ్రీనివాసరెడ్డి, కృష్ణనగర్

### చిత్రహింసలు పెడుతున్నారు

పేరేచర్లలోని దుకాణ సముదాయాల ద్వారా వచ్చే అద్దెలతో జీవిస్తున్నాం. అయితే ఓ దుకాణం ఖాళీగా ఉండటంతో మరో కుమారుడితో కలిసి శుభ్రం చేసుకుంటున్నాం. ఈ క్రమంలో నా పెద్ద కుమారుడు, కోడలు, ఆమె బంధువులు మాపై దాడికి యత్నించారు. మా తదనంతరం రాసిన వీలునామాను ఇటీవల రద్దు చేసుకోవడంతో పెద్ద కొడుకు చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా వారిపై ఎటువంటి చర్యల్లేవు. వృద్ధాప్యంలో ఉన్న మాకు న్యాయం చేయాలని కోరుతున్నాం.
– చదలవాడ రమేష్, పద్మావతి, పేరేచర్ల

### రూ.3 లక్షల రుణం పేరుతో మోసం..

ఏడాది క్రితం సంగడిగుంట రెడ్ల బజార్‌కు చెందిన ఓ మహిళ పరిచయమైంది. నెట్‌వర్క్ మార్కెటింగ్ అని, రూ.2 వేలు చొప్పున వెయ్యి మందితో కట్టిస్తే రూ.3 లక్షల రుణం ఇప్పిస్తానని నమ్మబలికింది. ఈ క్రమంలో ఇతరులతో రూ.12 లక్షలు, సొంతంగా పొలం విక్రయించి రూ.13 లక్షలు ఆమెకు చెల్లించాను. అయితే మోసపోయానని తెలిసి డబ్బులు అడిగితే చెల్లించడంలేదు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా, పట్టించుకోవడం లేదు. ఈనెల 19న నా భర్తను రెండు ఆటోల్లో కొందరు వచ్చి ఎత్తుకెళ్లి, చిత్రహింసలకు గురిచేశారు. అనంతరం పోలీసుల జోక్యంతో విడిచిపెట్టారు. మాకు న్యాయం చేయగలరు.
– ఓరుగంటి చంద్రలేఖ, కోటిరెడ్డి, 113 తాళ్ళూరు, ఫిరంగిపురం

## రైతులకు సరిపడా యూరియా సరఫరా

**జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు**

కొరిటిపాడు(గుంటూరు): జిల్లాలో యూరియాను రైతు అవసరాలకు మించి ఇప్పటికే సరఫరా చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌కుగాను ప్రధాన పంటలైన వరి, పత్తి పంటలను 77,340 హెక్టార్లలో సాగు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికీ జిల్లాలో 1,774 మెట్రిక్ టన్నుల యూరియా చిల్లర వర్తకులు, 2,014 మెట్రిక్ టన్నులు యూరియా టోకు వర్తకుల వద్ద కలిపి మొత్తం 3,788 మెట్రిక్ టన్నుల యూరియా రైతుల అవసరార్థం అందుబాటులో ఉందని పేర్కొన్నారు. యూరియా బ్లాక్ మార్కెట్, అధిక ధరలకు విక్రయిస్తే రైతులు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మానిటరింగ్ సెల్ నెంబర్-8331056906 నెంబర్‌కు రైతులు ఫిర్యాదు చేయవచ్చని ఆయన సూచించారు.

## జీజీహెచ్‌లో నకిలీ డాక్టర్ హల్‌చల్

**పోలీసులకు పట్టించిన సూపరింటెండెంట్**

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ పిల్లల వైద్య విభాగంలో డాక్టర్ మాదిరిగా ఓ మహిళ యాప్రాన్, సెతస్కోప్ ధరించి చికిత్సలు చేసేందుకు హడావుడి చేయడంతో పట్టుపడిపోయింది. గుంటూరుకు చెందిన జ్యోతి గతంలో పిల్లల విభాగంలో తన పిల్లలకు చికిత్స చేయించేందుకు కొన్ని రోజులపాటు ఉంది. రెండు రోజులుగా ఆసుపత్రిలో డాక్టర్ మాదిరిగా రౌండ్స్ వేస్తూ పిల్లలకు చికిత్స చేసేందుకు హడావుడి చేస్తుండటంతో వార్డుల్లో తనిఖీలు చేస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశ్విరమణకు అనుమానం వచ్చి ఆమెను పట్టుకుని ఆరా తీశారు. పొంతనలేని సమాధానాలు చెప్పడంతో తక్షణమే పోలీసులకు అప్పజెప్పారు. ఆమె వెంట మరో వ్యక్తి ఉండి అచ్చం డాక్టర్ మాదిరిగా వార్డులో హడావుడి చేస్తూ ఏదైనా ఆకృత్యాలతకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉండటంతో తక్షణమే పోలీసులకు అప్పగించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రమణ తెలిపారు.

## చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు

**డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి**



గుంటూరు మెడికల్: ఏఆర్టీ, సరోగసి యాక్ట్ అమలుపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. గుంటూరు జిల్లాలో ఇప్పటివరకు 27 హాస్పిటళ్లు ఏఆర్టీ, సరోగసి యాక్ట్‌లో రిజిస్టర్ అయి ఉన్నాయన్నారు. చట్టానికి లోబడి ఉండాల్సిన బాధ్యత 27 ఆసుపత్రుల యాజమాన్యాలపై ఉందన్నారు. తనతోపాటు ప్రోగ్రాం ఆఫీసర్లు తరచుగా ఈ ఆసుపత్రులను తనిఖీ చేస్తారని తెలిపారు. ఎక్కడైనా నిబంధనలు పాటించకపోతే వారిపై కేసు నమోదు చేసి, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రిజిస్టర్ల నిర్వహణ, ధరల పట్టికలు డిస్ ప్లే చేయడం తప్పనిసరి అని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించినట్లు తెలిస్తే ఆయా ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## సమస్యలు పరిష్కరించకుంటే బలిదానాలకు సిద్ధం

**జిల్లా ఐక్యవేదిక చైర్మన్ చాంద్ బాషా**


మాట్లాడుతున్న చాంద్‌బాషా

గుంటూరు వెస్ట్: సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేయకపోతే బలిదానాలకు సైతం తాము సిద్ధమవుతామని గుంటూరు జిల్లా ఐక్య వేదిక చైర్మన్ సయ్యద్ చాంద్ బాషా హెచ్చరించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమీపంలోని ఉద్యోగ సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో చాంద్ బాషా మాట్లాడుతూ సీపీఎస్‌తోనే సతమతమవుతుంటే జీపీఎస్ కూడా తెచ్చి మమ్మల్ని దారుణంగా దెబ్బతీసారన్నారు. ప్రజలకు దాదాపుగా 40 ఏళ్లు సేవచేస్తే మాపై ఎందుకింత కక్షని ప్రశ్నించారు. ప్రభుత్వం తమ న్యాయమైన కోర్కెలను అంగీకరించకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయులతోపాటు పెన్షనర్లు ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఉద్యోగ సంఘ నాయకులు లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, పెదరత్తయ్య, సుమిత్రా, పద్మజ, ఆలీసు, షబనా పాల్గొన్నారు.

# ‘పది’ సర్టిఫికెట్లు మాయం.. కలకలం

- నిర్మల సీబీఎస్ఈ హైస్కూల్‌లో ఘటన
- విద్యాశాఖ అధికారులకు తల్లిదండ్రుల ఫిర్యాదు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన డిప్యూటీ డీఈఓ


ఎంఈఓ కార్యాలయం వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన


స్కూల్ ప్రిన్సిపాల్ శిరీషను ప్రశ్నిస్తున్న డిప్యూటీ డీఈఓ శాంతకుమారి

మంగళగిరి: మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట నిర్మల హైస్కూలులో సీబీఎస్ఈ 10వ తరగతి సర్టిఫికెట్లు మాయమవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. తమ పిల్లల సర్టిఫికెట్లు కావాలని విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం పాఠశాల యాజమాన్యాన్ని అడగ్గా.. సర్టిఫికెట్లు కనిపించడం లేదంటూ సమాధానం రావడంతో కంగుతిన్నారు. దీంతో వారు పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. యాజమాన్యం సర్టిఫికెట్లు మాయం కాలేదని అందరికీ సర్టిఫికెట్లు అందిస్తామని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు ఎంఈఓ కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేశారు.

- దీనిపై విద్యాశాఖ డిప్యూటీ డీఈఓ శాంతకుమారి, ఎంఈఓ ఉషాకుమారిలు మాట్లాడుతూ జూన్ 23వ తేదీన సర్టిఫికెట్లు పాఠశాలకు రిజిస్టర్ పోస్టులో పంపామని, క్లర్క్ రత్నకుమారి సంతకం చేసి తీసుకున్నట్లు తెలిపారు. డెప్యూటీ డీఈఓ శాంత కుమారి స్కూల్ ప్రిన్సిపాల్ శిరీషను తన కార్యాలయానికి పిలిపించి సర్టిఫికెట్‌లపై ప్రశ్నించగా జూన్ 23వ తేదీన సర్టిఫికెట్లు వచ్చాయని, తమ క్లర్క్ ఎక్కడో పెట్టి మర్చిపోయిందని నింపాదిగా సమాధానం ఇవ్వడంతో ఆమె ఆగ్రహించారు. జూన్‌లో వచ్చిన సర్టిఫికెట్లు మాయమైతే.. ఇప్పటివరకు తమకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేయగా ఆర్జేడీ కార్యాలయానికి ఫిర్యాదు చేశామని ప్రిన్సిపాల్ తెలిపారు.
- క్లర్క్ రత్నకుమారి తాను రిజిస్టర్ పోస్టులో సంతకం మాత్రమే చేశానని, సర్టిఫికెట్ల బండిల్ తనకు ఇవ్వలేదని అధికారులకు చెప్పడం విశేషం. ఆర్జేడీ కార్యాలయానికి చేసిన ఫిర్యాదు కాపీతో పాటు సర్టిఫికెట్ల మాయం పూర్తి వివరాలు సేకరించిన డిప్యూటీ డీఈఓ శాంతకుమారి డీఈఓ విజయలక్ష్మికి సమాచారమివ్వగా, డీఈఓ సూచనల మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యమే సర్టిఫికెట్ల మాయానికి కారణమని, పైగా ఇంగ్లిష్, తెలుగు మీడియంల నిర్వాహకుల మధ్య కొద్దిరోజులుగా అంతర్గత వివాదం కొనసాగుతుందని, ఈ నేపథ్యంలో సర్టిఫికెట్లు మాయమయ్యాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వెంటనే ప్రభుత్వం కల్పించుకుని సర్టిఫికెట్లు త్వరగా వచ్చేలా చూసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.






### అయ్యో.. ఎంత కష్టం తల్లీ!

ఒక చేతిలో స్ట్రెచ్చర్.. మరో చేతిలో గ్యాస్ సిలిండర్.. భర్తను బతికించుకునేందుకు ఓ భార్య పడిన పాట్లు ఇవీ. బాబ్బాబూ.. కాస్త వార్డు దాకా లాగండయ్యా.. పుణ్యముంటుంది అని బతిమాలితే.. పుణ్యం కాదు పైసలున్నాయా.. అని చూసే వార్డు బాయ్‌లు.. కదిలిస్తే చాలు.. కయ్యని కసురుకునే ఆయమ్మల నడుమ.. ఇవన్నీ ఎందుకులే అనుకుంటూ భారమైనా.. సత్తువ లేకున్నా.. లాగలేకున్నా.. రొప్పుతూ.. రోదిస్తూ.. ఎలాగోలా సిలిండర్‌తో పాటు బండి లాగుతూ.. ఓ మహిళ పడిన కష్టమిది. వందలాది మంది సిబ్బంది పనిచేసే సర్వజనాసుపత్రిలో సోమవారం కనిపించిన హృదయ విదారక దృశ్యమిది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

## ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష తగదు

**జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి**


‘హెచ్ఐవీని చర్చిద్దాం- నిర్మూలిద్దాం’ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: ఎయిడ్స్ బారినపడకుండా ఉండాలని అనుకోని పరిస్థితుల్లో ఈ వ్యాధికి గురైన వారిపట్ల వివక్షత చూపవద్దని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ రూపొందించిన హెచ్ఐవీని చర్చిద్దాం – నిర్మూలిద్దాం పోస్టర్‌ను కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లి నుంచి శిశువుకు, కలుషితమైన సిరంజీలు, రక్తమార్పిడి, జాగ్రత్తలు పాటించని లైంగిక సంబంధాల కారణంగా హెచ్ఐవీ సోకుతుందన్నారు. వ్యాధి సోకినా కూడా ప్రభుత్వం అనేక విధాలుగా రోగులను ఆదుకుంటుందని తెలిపారు. దీని బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

**పేదల గృహాలు త్వరగా పూర్తి చేయాలి**

గుంటూరు వెస్ట్: జిల్లాలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా నిర్దేశించిన 11,049 ఇళ్ల నిర్మాణాలను ఈనెల 15వ తేదీలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈనెల 15వ తేదీకల్లా మూడు లక్షల ఇళ్లు ఒకేసారి గృహ ప్రవేశాలు చేయించాలని నిర్ణయించారన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో ఇప్పటికే 7వేల గృహాలు పూర్తి చేశారని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని, హౌసింగ్ అధికారులు ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలన్నారు. లే-అవుట్‌లలో అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ప్రతిపాదనలు అందించాలన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం ద్వారా ఇళ్లు నిర్మించుకోవడానికి ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. జేసీ ఎస్.భార్గవ్‌తేజ, డీఆర్వో షేక్ ఖాజావలి, సీపీఓ శేషశ్రీ, హౌసింగ్ పీడీ ప్రసాద్, డ్వామా పీడీ శంకర్, డీపీఓ సాయికుమార్ పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన


అరటి-చామగడ్డ పంటపొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

తెనాలి: ఆచార్య ఎన్ జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు గుంటూరు జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి కె.రాజకుమారి సమక్షంలో వివిధ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సోమవారం సందర్శించి, ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ప్రయోజనాలు, ఫలితాలు, రైతుల అనుభవాలను నేరుగా అవగాహన చేసుకున్నారు. తెనాలి రూరల్ మండలం గ్రామం ఎరుకలపూడిలో రైతు విజయలక్ష్మి వరి పొలంలో ఏర్పాటు చేసిన గట్టు మోడల్ వద్ద, ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ (ఏపీసీఎన్ఎఫ్) తొమ్మిది సార్వత్రిక సూత్రాలను వీక్షించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి కె.రాజకుమారి ఈ సూత్రాల విశిష్టత, వరి సాగులో గట్టు మోడల్ ప్రత్యేకతను వివరించారు. విజయలక్ష్మి, రంగయ్య తదితర రైతుల పది ఎకరాల వరి పొలం బ్లాక్‌ను పరిశీలించిన శాస్త్రవేత్తలు, ప్రకృతి వ్యవసాయంలో ‘బీఆర్ఐఎక్స్’ విలువలు 12 శాతంగా ఉండగా, రసాయనిక వ్యవసాయంలో 9 శాతమే నమోదైనట్లు గమనించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ బయోరిసోర్స్ సెంటర్‌ను సందర్శించారు.

- కొల్లిపర మండలం దావులూరిపాలెం గ్రామంలో రైతు వసంతమ్మ ఏ-గ్రేడ్ 365 డీజీసీ మోడల్ అరటి తోటను సందర్శించారు. ఇక్కడ బీఆర్ఐఎక్స్ విలువలు ప్రకృతి వ్యవసాయంలో 11 శాతం, రసాయనిక వ్యవసాయంలో 7 శాతం నమోదు కావటాన్ని గమనించారు. అదే గ్రామంలో మాణిక్యమ్మ అరటి-చామగడ్డ మోడల్ పంటను, శ్రీలక్ష్మీ సూర్య మండల మోడల్ పెరటి తోటను పరిశీలించారు. కొల్లిపర గ్రామంలో రాధాకృష్ణ స్వయంసహాయ సంఘ సభ్యులతో సమావేశమై, రైతుల అనుభవాలను విని వారిని శాస్త్రవేత్తలు అభినందించారు.

## సొంత ఖర్చుతో వైఎస్సార్, పూలే విగ్రహాలకు రంగులు



ఆత్మకూరు(మంగళగిరి): మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జాతీయ రహదారి వెంట కల ఆత్మకూరు ప్రధాన స్వాగత ద్వారం వద్ద వున్న దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాలకు స్థానిక వైఎస్సార్ అభిమాని పి.రాంబాబు సోమవారం తన సొంత ఖర్చుతో రంగులు వేయించాడు. మంగళవారం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా రంగులు వెలసిపోయి వున్న విగ్రహాలకు అభిమానిగా తన ఖర్చుతో రంగులు వేయించినట్లు రాంబాబు తెలిపాడు.

## నిమజ్జనానికి తరలిన ‘జెడ్పీ’ గణేశుడు


గణేష్ నిమజ్జనోత్సవంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, సీఈఓ జ్యోతిబసు, అధికారులు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో కొలువైన విఘ్నేశ్వరుడు సోమవారం నిమజ్జనానికి బయలుదేరాడు. ఎనిమిదవ గణపతి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన నిమజ్జనోత్సవంలో భాగంగా జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ దంపతులు గణేష్ మండపం వద్ద కొబ్బరికాయ కొట్టి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయంత్రం మేళతాళాలతో నిమజ్జనానికి విఘ్నేశ్వరుని తరలించారు. వేలంలో నంబూరు నిర్మల భారతి లడ్డూను రూ.45 వేలకు దక్కించుకున్నారు. వేలంను ఉద్యోగులు ఉషాదేవి, అహ్మద్ నిర్వహించారు. జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు, పంచాయతీరాజ్ ఉద్యోగుల రాష్ట్ర నాయకుడు డాక్టర్ కూచిపూడి మోహన్, జెడ్పీ పరిపాలనాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## పేరు గొప్ప.. ఊరు దిబ్బగా ప్రైవేటు వర్సిటీలు

మంగళగిరి టౌన్: పేరు గొప్ప.. ఊరు దిబ్బగా రాజధానిలోని ప్రైవేటు వర్సిటీలు ఉంటున్నాయని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ ఎద్దేవా చేశారు. మంగళగిరి సీపీఎం కార్యాలయంలో సోమవారం రాత్రి పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. నేతాజీ మాట్లాడుతూ అమరావతి రాజధాని పరిధిలో విట్, ఎస్ఆర్ఎం, ఇతర యూనివర్సిటీలలో విద్యార్థులు రూ.లక్షలు ఫీజులు చెల్లించి చదువుకుంటున్నారని, వారికి మాత్రం నాణ్యత లేని అపరిశుభ్రమైన ఆహారాన్ని అందిస్తున్నారని విమర్శించారు. 15 రోజుల క్రితం విట్ యూనివర్సిటీలో ఆహారం సరిగా లేదంటూ విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళన చేశారని, అది మరువక ముందే ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నాణ్యత లేని ఆహారం అందిస్తున్నారంటూ విద్యార్థులు ఆందోళనకు దిగడం యూనివర్సిటీల యాజమాన్యాల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.